నిలిచిన ధాన్యం కొనుగోళ్లు


ఇనుపాముల పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం రాశులు


తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు

- వర్షాలకు కొనుగోలు కేంద్రాల్లో తడుస్తున్న ధాన్యం
- రోడ్లపై ధాన్యం ఆరబెడుతున్న రైతులు
- లారీలను పంపించడానికి నిరాకరిస్తున్న యజమానులు

కేతేపల్లి: ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యాన్ని అమ్ముకోవడం రైతులకు తలనొప్పిగా మారింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు సకాలంలో చేపట్టకపోవడం, మరోవైపు అకాల వర్షాలతో రైతులు సతమతమవుతున్నారు. కేతేపల్లి మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో ఇరవై రోజుల క్రితం అధికారులకు పది ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. వీటిలో కేతేపల్లి సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఆరు, ఐకేపీ ఆధ్వర్యంలో 4, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో 2 కేంద్రాలను ఏర్పాటు చేశారు. పది గ్రామాలు మూసీ ఆయకట్టు కింద ఉండడంతో ఆయా కొనుగోలు కేంద్రాలకు ధాన్యం భారీగా వస్తోంది. కేంద్రాల్లో స్థలం సరిపోకపోవడంతో కాల్వ కట్టలు, రోడ్లపై రైతులు తమ ధాన్యం ఆరబెడుతున్నారు.

మిల్లుల కేటాయింపు లేకనే..

కేతేపల్లి మండలంలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించేందుకు జిల్లా అధికారులు ఇంకా మిల్లులను కేటాయించలేదు. కేతేపల్లి సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆరు కేంద్రాల్లో కేవలం ఇనుపాముల, కొత్తపేట గ్రామాల్లో మాత్రమే పది రోజుల క్రితం రెండు రోజులపాటు కాంటాలు వేసి 1,116 కింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఐకేపీ ఆధ్వర్యంలో గుడివాడ కేంద్రంలో ఒకే ఒక రోజు కాంటాలు వేసి కేవలం 260 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. మిల్లుల కేటాయింపు లేకపోవడంతో కొనుగోలు చేసిన ధాన్యాన్ని కట్టంగూర్ మండలంలోని కురుమర్తి గ్రామంలో గల ఎఫ్‌సీఐ గోదాములకు, శాలిగౌరారం మండల కేంద్రంలోని ఏఎంసీ మార్కెట్‌కు తరలించారు. అక్కడ లారీల నుంచి ధాన్యం దిగుమతి చేసేందుకు వారం రోజులపాటు సమయం పట్టడంతో లారీలను పంపేందుకు యజమానులు అంగీకరించడం లేదు. దీంతో మిల్లులను కేటాయించిన తర్వాతనే ధాన్యం కొనుగోళ్లు ప్రారంభిస్తామంటూ పది రోజుల నుంచి అధికారులు కొనుగోళ్లు పూర్తిగా నిలిపివేశారు.

వర్షానికి తడిసిన ధాన్యం

కొనుగోలు కేంద్రాల్లో సక్రమంగా ధాన్యం కొనుగోళ్లు లేకపోవడంతో ఒక్కో కేంద్రంలో వేల బస్తాల ధాన్యం రాశులు పేరుకుపోయాయి. కాగా మండలంలోని పలు గ్రామాల్లో శనివారం రాత్రి వర్షం కురిసింది. దీంతో కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యం పూర్తిగా తడిసి పోయింది. కేంద్రాల్లో సరిపోను చోటు లేకపోవడంతోపాటు, ధాన్యం రాశులు పక్కపక్కనే ఉండడంతో తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. ధాన్యం కొనుగోళ్లు వెంటనే ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయింది



మూడెకరాల పొలంలో పండించిన ధాన్యాన్ని ఇనుపాముల ధాన్యం కొనుగోలు కేంద్రానికి పది రోజుల క్రితం తీసుకువచ్చాను. ఇప్పటి వరకు కొనుగోలు చేయలేదు. ఎండబెట్టిన ధాన్యం అకాల వర్షానికి తడిసిపోయింది. ధాన్యం 17 పాయింట్ల మేర మ్యాచర్ వస్తేనే కొనుగోలు చేస్తామంటున్నారు. కేంద్రంలో ఆరబెట్టడం ఇబ్బందిగా ఉంది. త్వరగా ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలి.

–చింతకాయల సైదులు, రైతు, కొత్తపేట

మిల్లుల కేటాయింపు జరగలేదు



కొనుగోలు చేసిన ధాన్యం తరలించేందుకు జిల్లా అధికారులు మిల్లులను కేటాయించలేదు. కొనుగోలు చేసిన ధాన్యం లోడు లారీలో నుంచి దిగుమతి చేయడానికి వారం రోజుల సమయం పడుతోంది. దీంతో కొనుగోళ్లు నిలిపివేశాం. ఒకట్రెండు రోజుల్లో మిల్లుల కేటాయింపు జరుగుతుంది. వెంటనే ధాన్యం కొనుగోళ్లు ప్రారంభిస్తాం. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకుని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలి.

–బి.యాదమ్మ, ఐకేపీ ఏపీఎం, కేతేపల్లి

క్లుప్తంగా

దివ్యాంగుల పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం

నల్లగొండ టౌన్: నల్లగొండలోని సూర్యకిరణ్ మానసిక దివ్యాంగుల పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు డాక్టర్ బొమ్మరబోయిన కేశవులు తెలిపారు. దాతలు ముందుకు వచ్చి ఈ పాఠశాలకు సహాయ సహకారాలు అందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జలసాధన సమితి జాతీయ అధ్యక్షులు దుశ్చర్ల సత్యనారాయణ, తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, హౌసింగ్ పీడీ రాజ్ కుమార్, సీడీపీవో నిర్మల, వన్ టౌన్ ఎస్ఐ శంకర్, సూర్యకిరణ్ మానసిక వికలాంగుల పాఠశాల ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక వ్యవస్థను విధ్వంసం చేసిన కేసీఆర్

నల్లగొండ రూరల్: మిగులు బడ్జెట్‌లో ఉన్న రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మాజీ సీఎం కేసీఆర్ విధ్వంసం చేశాడని టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మార్జున్ అన్నారు. మంగళవారం స్థానిక అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 9న టీజేఎస్ జిల్లా ప్లీనరీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్లీనరికి కోదండరామ్ హాజరవుతారన్నారు. కేసీఆర్ అక్రమ సంపాదనలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని విచ్ఛిన్నం చేశాడని అన్నారు. కార్యక్రమంలో టీజేఎస్ అధ్యక్షుడు గోపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నాగేశ్వర్‌రావు, కార్యదర్శి పులి పాపయ్య, ఉపాధ్యక్షులు ఎల్. క్రాంతికుమార్, ప్రకాశ్‌నాయుడు, ప్రేమ్‌కుమార్, బచ్చిరెడ్డి, పాల్గొన్నారు.

మున్సిపాలిటీకి ఎల్ఈడీ లైట్స్ అందజేత

చిట్యాల: పట్టణంలో జాతీయ రహదారికిరువైపులా ఉన్న విద్యుత్ లైట్స్ లేక వాహనదారులతో పాటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో రాష్ట్ర బీజేపీ నాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు కునూరు సంజయ్‌దాస్‌గౌడ్ సుమారుగా పన్నెండు వేల రూపాయల విలువ గల ఎల్ఈడీ లైట్స్‌ను మున్సిపల్ కమిషనర్ వీరేందర్‌కు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బొడిగె అశోక్, నకిరేకల్ నియోజకవర్గ లీగల్ సెల్ కన్వీనర్ గుండాల నరేష్‌గౌడ్, దేవేందర్, లింగస్వామి పాల్గొన్నారు.

కొనుగోళ్లు వేగవంతం చేయాలి


తేమ శాతాన్ని పరీక్షిస్తున్న తహసీల్దార్ జమురుద్దీన్

నకిరేకల్: కొనుగోళ్లు వేగవంతం చేయాలని నకిరేకల్ మండల తహసీల్దార్ జమురుద్దీన్ సూచించారు. నకిరేకల్ మండలం వల్లాభాపురం,టేకుల గూడెం, ఓగోడు ,నోముల గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ఆయన సందర్శించారు. ధాన్యం ఆరబెట్టుకుంటే కొనుగోలు వెంటనే చేస్తారని విషయంపై అవగాహన కల్పించాలన్నారు.

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

తిప్పర్తి : మహిళలు ఆర్థికంగా బలోపేతం చేందినప్పుడే కుటుంబాలు అభివృద్ధి చెందుతాయని డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి అన్నారు.ఆయన మంగళవారం మండలంలోని దుప్పలపల్లి గ్రామంలో పెరటి కోడి పిల్లలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీఎం శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

నేడు హుండీ లెక్కింపు

కనగల్: మండల పరిధిలోని దర్వేశిపురం శ్రీ రేణుక ఎల్లమ్మ దేవస్థాన హుండీని బుధవారం ఉదయం 9గంటలకు లెక్కించనున్నట్లు ఆలయ ఈఓ జల్లేపల్లి జయరామయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ సిబ్బంది సకాలంలో హాజరు కావాలన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

మునుగోడు: ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటకు కట్టుబడి గ్రామాలల్లోని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని సీపీఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బొల్గూరి నర్సింహ కోరారు. మండలంలోని పులిపలుపుల గ్రామంలో జరిగిన సీపీఐ పార్టీ గ్రామశాఖ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైయి ఏడాది కావస్తున్న నేటికి వృద్ధ మహిళలు, వితంతువులు, వికలాంగులకు నూతన ఆసరా పెన్షన్లు మంజూరు చేయకపోవడం విచారకరమన్నారు. ఈ సమావేశంలో ఆ పార్టీ నాయకులు కాయితం వెంకన్న, కొంపల్లి రాములు, గుండెబోయిన భాస్కర్, జనగాం శంకర్, పందుల యాదయ్య, మునుగోడు సత్యనారయణ, సింగం యాదయ్య,మారయ్య పాల్గొన్నారు.

నకిరేకల్ విద్యార్థినికి సిల్వర్ మెడల్

నకిరేకల్ : సంగారెడ్డి జిల్లాలో ఈనెల 2 నుంచి 4 వరకు జరిగిన ఎస్‌జీఎఫ్ స్టేట్ మీట్, నేషనల్ పోటీల్లో నకిరేకల్ డివిజన్‌కు చెందిన ఎల్ ఆమని 22 కేజీలో ద్వితీయ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సాధించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీరేశం ఆమనని అభినందిచారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

శాలిగౌరారం: ప్రభుత్వ పాఠశాలలను పూర్తిస్థాయిలో బలోపేతం చేయడానికి తాను నిరంతరం కృషి చేస్తున్నట్లు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. వరంగల్–ఖమ్మం–నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఓటరు నమోదు, ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం మండలంలోని వల్లాల గ్రామంలో గల ప్రభుత్వ మోడల్‌స్కూల్‌లో ప్రచారం నిర్వహించి ఉపాధ్యాయులతో సమీక్షాసమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రచార కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి యాట మధుసూదన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రాగి రాకేశ్‌కుమార్, ప్రతినిధులు రవికుమార్, నర్సింహమూర్తి, జయసాగర్, శ్రీను, చక్రపాణి, కిషోర్, రామకృష్ణారెడ్డి, హరికృష్ణ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా గెలిపించాలని ప్రచారం

నకిరేకల్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిరంతరం పోరాటం చేస్తున్న తనకు ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా మరో సారి అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి కోరారు. నకిరేకల్ పట్టణంలోని సాంఘిక గురుకుల పాఠశాల, జెడ్పీ హైస్కూల్, ప్రభుత్వ డిగ్రీ ,జూనియర్ కళాశాలల్లో మంగళవారం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి యాట మధుసూధన్‌రెడ్డి, మండల శాఖ అధ్యక్ష,కార్యదర్శులు తాటిపాముల నర్సింహ్మమూర్తి, కుర్మిళ్ల శ్రీనివాస్, ప్రతినిధులు రాకేష్‌కుమార్, బి.వేణుగోపాల్, వెంకన్న,సత్తయ్య, జయసాగర్, చక్రపాణి పాల్గొన్నారు.

నిజాయితీగా కృషి చేస్తా

కేతేపల్లి: తనను మరోసారి ఎమ్మెల్సీగా గెలిపిస్తే పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిజాయితీగా కృషి చేస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కేతేపల్లి జెడ్పీ పాఠశాల, కేజీబీవీ, మోడల్‌స్కూల్ పాఠశాలలను సందర్శించిన ఆయన ఎమ్మెల్సీ ఓటరు నమోదు అవగాహన, ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి యాట మధుసూదన్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు టి.నర్సింహ్మమూర్తి, రాగా రాకేష్, మండల ప్రతినిధులు బచ్చుపల్లి మధు, పుణ్యమూర్తి, జయసాగర్, శ్రీను పాల్గొన్నారు.

ధ్యాన్యాన్ని ఆరబెట్టుకుని తీసుకురావాలి

నాంపల్లి: ధ్యాన్యాన్ని ఆరబెట్టుకుని కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని తహసీల్దార్ గోగులోతు దేవసింగ్, సింగిల్ విండో చైర్మన్ గట్టుపల్లి నర్సింహ అన్నారు.మంగళవారం మండలంలోని చిట్టంపహాడ్ గ్రామంలో ధ్యాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మేరి సవర్ణకుమారి, ఎంపీఓ ఝన్సీ,మాల్ మార్కెట్ డైరెక్టర్ రాగిఫణి అంజాచారి,సింగిల్ విండో డైరెక్టర్లు ఎరెడ్ల వెంకట్‌రెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.


కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ నర్సింహ

మద్దతు ధరకు కొనుగోలు చేయాలి


మాట్లాతున్న పాలడుగు నాగార్జున

మర్రిగూడ: వరి, పత్తిలో తేమ సాకు లేకుండా ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పాలడుగు నాగార్జున అన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా మద్దతు ధరకు కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో నాంపల్లి, మర్రిగూడ మండలాల కార్యదర్శులు నాంపల్లి చంద్రమౌళి, ఏర్పుల యాదయ్య, కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు బొట్ట శివకుమార్, మండల కమిటీ సభ్యులు ముత్తిలింగం, దేవీయ్య, నీలకంఠం రాములు, కొట్టం యాదయ్య, దామెర లక్ష్మీ, గిరి, విష్ణు, కృష్ణయ్య, వెంకటేష్, రమేష్, వెంకటయ్య, పల్లపు రాజు పాల్గొన్నారు.

సేవే లక్ష్యంగా వాసవీ క్లబ్‌లు


వాసవీ మాతకు పూజలు చేస్తున్న ప్రతినిధులు

నకిరేకల్ : సేవే లక్ష్యంగా వాసవీ క్లబ్‌లు ముందుకు సాగుతున్నాయని ఆక్లబ్ ఇంటర్నేషనల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ విశ్వనాథం శ్రీనివాస్ అన్నారు. వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ వి104ఏ రీజినయన్ పరిధిలో అన్ని క్లబ్‌ల ప్రాంతీయ సమ్మేళనం నకిరేకల్ లోని గుడిపాటి ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో జిల్లా పరిశీలికురాలు బ్రహ్మదేవర పద్మావతి,దేవర శెట్టి విజయలక్ష్మి, గుండా నరేందర్ కరుణా, వీరవెల్లి రఘునాధ్‌రాధకవి, బచ్చు శ్రీనివాస్‌శ్రీదేవి, ఉప్పల శివ క్రిష్ణ, గుడిపాటి రవి, వజ్రపు సంతోష్‌కుమార్, ప్రణీత, వాడకట్టు రాధిక, కందగట్ల భవాని తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి

నల్లగొండ టూటౌన్ : మున్సిపాలిటీల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులందరినీ రెగ్యులరైజ్ చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో రెండో రోజు మంగళవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట నిర్వహించిన రిలే నిరాహార దీక్షల్లో పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లలో 65 వేల మంది కార్మికులు పని చేస్తున్నారని, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, డంపింగ్‌యార్డు, వాహనాల డ్రైవర్లు, పార్కుల నిర్వహణ తదితర వాటిల్లో పని చే స్తున్నారని తెలిపారు. మురుగు కాల్వలు తీయడం, చెత్త చెదారం ఊడుస్తున్న కార్మికుల పట్ల సానుకూలంగా వ్యవహరించి ప్రభుత్వం పర్మినెంట్ చేయాలని కోరారు. కనీస వేతనం రూ. 26 వేలు చేయాలని, అర్హులైన వారికి పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండి. సలీం, జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, అద్దంకి నర్సింహ్మా, యూనియన్ నాయకులు పాలడుగు వెంకటేశం, కత్తుల పద్మ, నక్క సత్తయ్య, సంధ్య, నంద భాగ్యమ్మ, దీనమ్మ, సావిత్రమ్మ, పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు భూపాల్

సదర్ ఉత్సవాల పోస్టర్ విడుదల


సదర్ ఉత్సవాల ప్రచార పోస్టర్ విడుదల చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

చిట్యాల: నల్లగొండలో ఈ నెల 10న నిర్వహించనున్న సదర్ ఉత్సవాల ప్రచార పోస్టర్‌ను రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హైదరాబాద్‌లో మంగళవారం విడుదల చేశారు. అనంతరం ఆయనకు ఉత్సవాల నిర్వాహకులు ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు మేకల యాదన్న యాదవ్, చిట్యాల ఏఎంసీ మాజీ చైర్మన్ కాటం వెంకటేశం, కన్నెబోయిన సైదులు యాదవ్, ఆవుల సుందర్ యాదవ్ పాల్గొన్నారు.

నూతన ఉపాధ్యాయులు ఉత్తమ బోధనందించాలి

- డీఈఓ బొల్లారం భిక్షపతి


విద్యార్థిని అభ్యసన తీరును పరిశీలిస్తున్న డీఈఓ

చిట్యాల: ఇటీవల ప్రభుత్వ పాఠశాలల్లో నూతనంగా ఉపాధ్యాయ విధుల్లో చేరిన వారు ఉత్తమ బోధన అందించాలని నల్లగొండ డీఈఓ బొల్లారం భిక్షపతి సూచించారు. చిట్యాల మండలంలోని చిట్యాల, వట్టిమర్తి గ్రామాలలోని జెడ్పీహెచ్ఎస్, ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేకంగా ఆయా సబ్జెక్టుల వారీగా పలు ప్రశ్నలను వేసి సమాధానాలను రాబట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించి వార్షిక ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత శాతంను సాధించేందుకుగాను ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ పానుగోతు సైదానాయక్, హెచ్ఎంలు గోగిగార్ మాధవి, సత్తయ్య పాల్గొన్నారు.

నేటి నుంచి స్టిక్కర్ల అతికింపు


కుటుంబ సర్వే పత్రం ఇంటింటికీ అతికించనున్న స్టిక్కరు

నల్లగొండ టూటౌన్ : సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేలో భాగంగా మొదట నీలగిరి పట్టణంలోని 48వార్డుల్లో ఉన్న నివాస భవనాలకు స్టిక్కర్లు అతికించనున్నారు. బుధవారం నుంచి ఈనెల 7వ తేదీ వరకు పట్టణంలోని అన్ని వార్డులు, కాలనీల్లో ఎమ్యునెటర్లు స్టిక్కటర్లు ఇంటింటికి తిరికి అతికించనున్నారు. 48 వార్డులను 303 బ్లాక్‌లుగా విభజించారు. ఒక్కో బ్లాక్‌కు ఒక్కో ఎమ్యునెటర్ వెళ్లి ఇంటికి స్టిక్కర్ అతికించడంతో పాటు సంబంధిత కుటుంబ యజమాని ఫోన్ నంబర్, కుటుంబ సభ్యుల సంఖ్య వివరాలను సేకరించనున్నారు. ఒక్క బ్లాక్‌లో 150 నివాసాలను ఒక్క ఎమ్యునెటర్‌కు కెటాయించారు. ఇప్పటికే స్టిక్కర్లను మున్సిపల్ అధికారులు సంబంధిత ఎమ్యునేటర్లకు పంపిణీ చేశారు. మూడు రోజుల పాటు స్టిక్కర్లు అతికించిన తరువాత పట్టణంలో ఎన్ని నివాస భవనాలు ఉన్నాయో లెక్క తేలనుంది. ఒక్క నివాస భవనంలో నాలుగు కుటుంబాలు అద్దెకు ఉన్నా వారి కోసం కూడా స్టిక్కర్లు అతికిస్తారు. కాగా సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే అధికారికంగా ఈనెల 9వ తేదీన ప్రారంభినున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. 10 బ్లాక్‌లకు ఒక సూపర్‌వైజర్ పర్యావేక్షించనున్నారు. పట్టణంలో ఎన్ని నివాస భవనాలు ఉన్నాయో వాటన్నింటికి స్టిక్కర్లు అతికించిన తరువాత కుటుంబ సభ్యుల వివరాల సేకరణకు ఈనెల 9వ తేదీ నుంచి ఇంటింటి వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలతో పాటు ఆస్తులు, సామాజిక వర్గం వివరాలు పత్రాల్లో రాసుకుంటారు.

పెన్షనర్ల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి


నిరసన తెలుపుతున్న పెన్షనర్లు

నల్లగొండ టూటౌన్: ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలు దీర్ఘకాలికంగా పరిష్కరించబడడంలేదని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లింగా అరుణ అన్నారు. మంగళవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్ ట్రెజరీ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 నెలలు అవుతున్నా పెన్షనర్ల సమస్యలు పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నూకల జగదీష్‌చంద్ర, పందిరి శ్యాంసుందర్, గౌరవాధ్యక్షుడు కుకుడాల గోవర్ధన్, జిల్లా కోశాధికారి అబ్దుల్ ఖాదర్, వనం వాణిశ్రీ, వాడపల్లి రమేష్, గుండాల భిక్షమయ్య, టి. కౌసల్య, పి. వెంకట్‌రెడ్డి, సీహెచ్. భిక్షమయ్య, రబియాబేగం, ఎండి. జబ్బార్, కాలం అనంతరెడ్డి, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నర్సిరెడ్డికి మద్దతునివ్వాలి

చిట్యాల: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం చేసే టీఎస్ యూటీఎఫ్ టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి ఉపాధ్యాయులంతా మద్దతునిచ్చి గెలిపించాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు బడుగు అరుణ కోరారు. చిట్యాల మండలంలోని పలు పాఠశాలలను మంగళవారం ఆమె సందర్శించి టీచర్ ఎమ్మెల్సీగా నర్సిరెడ్డిని గెలిపించాలని ఉపాధ్యాయులను కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల కార్యదర్శి ఏశమల్ల నాగయ్య, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఆలయ భూముల పరిశీలన

చిట్యాల:మండలంలోని పెద్దకాపర్తి గ్రామంలోని శ్రీ తిరుమలనాథ స్వామి ఆలయ భూములు రియల్టర్లు ఆక్రమిస్తున్నారని ఆ గ్రామస్తులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయటంతో మంగళవారం దేవాదాయ, ధర్మధాయ శాఖ డివిజన్ ఇన్‌స్పెక్టర్ బి.సుమతి ఆ గ్రామస్తుల సమక్షంలో ఆలయ భూములను పరిశీలించారు. కార్యక్రమంలో ఆలయ అధికారి నాగిరెడ్డి, గ్రామస్తులు పొట్లపల్లి చిన్నస్వామి, పోట్లపల్లి నర్సింహ, చేకూరి గణేష్, బాలగోని రాజు, ముద్దసాని రమణారెడ్డి, ఏర్పుల రాకేష్, మాచర్ల యాదగిరి, బత్తుల శ్రీరంగం, కురు సత్తయ్య, పున్న విష్ణు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇబ్బందులు పడవద్దు

నాంపల్లి: విద్యార్థులు మాధ్యాహ్న భోజనానికి ఇబ్బందులు పడవద్దని స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి స్పందించి మంగళవారం నాంపల్లి హైస్కూల్‌లో వంట గిన్నెల సామగ్రిని నాయకుల చేత అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అజయ్‌కుమార్,ఎరెడ్ల రఘుపతిరెడ్డి,పూల వెంకటయ్య,ఎండి గఫార్,దుర్గయ్య,పానగంటి వెంకటయ్య,కామిశెట్టి యాదయ్య,సగెపు గణేష్,వెంకటయ్య, పాల్గొన్నారు.

వేమారెడ్డికి నివాళి

కేతేపల్లి: మండలంలోని ఇనుపాముల ఆవాస గ్రామం రాయపురంలో ఇటీవల మృతి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బత్తుల వేమారెడ్డి దశదిన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో టీపీసీసీ నేత దైదా రవీందర్ పాల్గొని వేమారెడ్డి చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు గార్లపాటి రవీందర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, బత్తుల సంజీవరెడ్డి, రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, యూసుఫ్, నక్షత్ తదితరులు ఉన్నారు.

నేడు పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

నార్కట్‌పల్లి: మండలంలోని చౌడంపల్లి గ్రామ సమీపాన గల వరలక్ష్మి కాటన్ మిల్లులో బుధవారం నుంచి పత్తి కోనుగోలు కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి జానయ్య తెలిపారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రారంభించనున్నట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి


నల్లగొండ : పానగల్లు రేణుక ఎల్లమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


రేణుక ఎల్లమ్మ ఆలయంలో బారులుదీరిన భక్తులు


బీటీఎస్ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


వీటీ కాలనీలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు


నకిరేకల్: వాసవీ వనితా క్లబ్ ఆధ్వర్యంలో..

బహిరంగ సభను జయప్రదం చేయాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం

చండూరు : భూమి, భుక్తి, వెట్టి చాకిరి విముక్తి కోసం నిరంతరం ప్రజలపక్షాన నిలబడి పోరాడిన భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) శత వార్షికోత్సవాల సందర్భంగా డిసెంబర్ 30న నల్లగొండలో నిర్వహించే బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం పిలుపునిచ్చారు. మంగళవారం చండూరులో నిర్వహించిన పార్టీ మండల కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1925 డిసెంబర్ 26న ఉత్తర ప్రదేశ్‌లోని కాన్పూర్‌లో సీపీఐ ఆవిర్భవించిందన్నారు. శత వార్షికోత్సవాల సందర్భంగా డిసెంబర్ 30న నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎన్‌జీ కాలేజీ మైదానంలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. పార్టీ మండల సహాయ కార్యదర్శి పల్లె యాదయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో నలపరాజు రామలింగయ్య, నలపరాజు సతీష్ కుమార్, బొడ్డు వెంకటేశ్వర్లు, తిప్పర్తి రాములు, బరిగల వెంకటేష్, దోటి వెంకన్న, గంటా రమేష్, బండమీది వెంకన్న, సిహెచ్.ఉషయ్య, ఇరిగి సంజీవ, గడ్డం నవీన్, శివర్ల లింగస్వామి, పరమేశ, ఇరిగి ప్రవీణ్, గంటా నగేష్, కట్ట వెంకన్న తదితరులు పాల్గొన్నారు.